నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, శనివారం 21 సెప్టెంబర్ 2024 | RANGAREDDY


కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఎలాంటి షరతుల్లేకుండా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని అన్నదాతలను మాయ చేసి అధికారంలోకి రాగానే మొండి చెయ్యి చూపుతున్నది. నిబంధనల పేరుతో ఎన్నో కొర్రీలు పెట్టి వేలాది మంది అర్హులను మాఫీకి దూరం చేసింది. అయితే రైతుల నుంచి వ్యతిరేకత రాగానే.. అర్హులందరి రుణాలను మాఫీ చేస్తామని చెప్పి..రుణమాఫీ గ్రీవెన్స్ ప్రక్రియను చేపట్టింది. ఈ విధానంలో వ్యవసాయాధికారులు ఇంటింటికీ తిరుగుతూ మాఫీ వర్తించని అన్నదాతల నుంచి వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో ఎంట్రీ చేస్తున్నారు. గత నెల రోజులకు పైగా ఈ ప్రక్రియ సాగుతున్నా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించకపోవడంతో అన్నదాతలు మండిపడుతున్నారు. కాలయాపన కోసం రుణమాఫీ గ్రీవెన్స్‌ను తీసుకొచ్చారని పేర్కొంటున్నారు. కాగా వికారాబాద్ జిల్లాలో రుణమాఫీ గ్రీవెన్స్‌కు ఇప్పటివరకు 25,000 పైగా దరఖాస్తులొచ్చాయి.

## ఒక్క దరఖాస్తునూ

# పరిష్కరించలే..

### వికారాబాద్ జిల్లాలో కొనసాగుతున్న రుణమాఫీ గ్రీవెన్స్ ప్రక్రియ

- రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు
- ఇప్పటివరకు ఒక్క దరఖాస్తునూ పరిష్కరించని ప్రభుత్వం
- ప్రత్యేక యాప్‌లో ఎంట్రీతోనే సరిపెడుతున్న అధికారులు
- జిల్లాలో రుణమాఫీ గ్రీవెన్స్‌కు 25 వేలకుపైగా అప్లికేషన్లు
- రేషన్‌కార్డు లేకపోవడంతో 18,431 మంది రుణమాఫీకి దూరం
- రూ.2 లక్షలపై ఉన్న రుణాలను చెల్లించినా ఇప్పటికీ ఖరారు కాని గైడ్‌లైన్స్.. ఆందోళనలో అన్నదాతలు



వికారాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): జిల్లాలో రుణమాఫీ గ్రీవెన్స్ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. నెల రోజులకు పైగా రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నా ఇప్పటివరకు ఒక్క దరఖాస్తుకూ మోక్షం లభించలేదు. అర్హులైనప్పటికీ రూ. 2 లక్షల్లోపు రుణాలు మాఫీ కాని అన్నదాతలు కలెక్టరేట్ మొదలుకొని మండల వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఒక్కో రైతు నాలుగైదు సార్లు రుణమాఫీ వర్తించలేదని వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించి రుణాలను మాఫీ చేయలేదు. కేవలం కాలయాపన కోసమే గ్రీవెన్స్ ప్రక్రియను చేపట్టినట్లు మాఫీ వర్తించని అన్నదాతలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ అంటూ అనేక కొర్రీలు, నిబంధనలు పెట్టి వేలాది మంది రైతులకు మాఫీ వర్తించకుండా చేసింది. రుణాలు మాఫీ కాని అన్నదాతల కోసం ప్రభుత్వం మొదట కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటుతోపాటు డీఏవో, మండల వ్యవసాయాధికారి కార్యాలయాల్లో అప్లికేషన్లను స్వీకరించింది. అనంతరం మండల వ్యవసాయాధికారులకు గ్రీవెన్స్ బాధ్యతలు అప్పగించి ప్రత్యేకంగా యాప్‌ను ఏర్పాటు చేసింది. అయితే గత నెల రోజులకుపైగా మండల వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తూ రుణమాఫీ కాని రైతుల వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. అయితే రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడం, ఒకరి ఆధార్ నంబర్‌కు బదులు మరొకరి ఆధార్ నంబర్ ఎంట్రీ చేయడం, వడ్డీని కలపకుండా కేవలం రైతులు తీసుకున్న రుణాలను మాత్రమే ఎంట్రీ చేయడం తదితర కారణాలతో జిల్లాలోని దాదాపు 80 వేల మంది రైతులు నష్టపోయారు.

జిల్లాలోని గ్రీవెన్స్‌కు ఇప్పటివరకు 25,011 మంది రైతులు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు. అందులో అత్యధికంగా రేషన్ కార్డు లేకపోవడంతోనే 18,431 మందికి కాలేదని వ్యవసాయాధికారుల సర్వేలో తేలింది. కాగా నవాబుపేట మండలంలో రెండు వేల మందికిపైగా రైతులు గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాలో సుమారు 1.70 లక్షల మంది రైతులు రుణాలు తీసుకుంటే ..రూ.2 లక్షల్లోపు రుణమాఫీతో కేవలం 91,956 మందికే లబ్ధి చేకూరింది. అయితే మొదటి విడతలో 46,633 మందికి రూ.256.26 కోట్లు, రెండో విడతలో 26,438 మందికి రూ. 265.04 కోట్లు, మూడో విడతలో 18,885 మందికి రూ.247.71 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. మరోవైపు రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతుల పరిస్థితి గందరగోళంగా తయారైంది. కటాఫ్ రుణానికి మించి ఉన్న రైతుల్లో చాలామంది ఇప్పటికే పైన ఉన్న మొత్తాన్ని చెల్లించి సంబంధిత రసీదులను వ్యవసాయాధికారులకు అందజేసినప్పటికీ ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి విధివిధానాలు రూపొందించలేదు. దీంతో అన్నదాతలు తమ రుణాలు మాఫీ అవుతాయా..? లేదా అని మథన పడుతున్నారు.

### రుణమాఫీ గ్రీవెన్స్‌కు 25 వేలకుపైగా దరఖాస్తులు

### కొనసాగుతున్న సర్వే..

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణకు వ్యవసాయాధికారులు ఇంటింటి సర్వే చేస్తున్నారు. అయితే ఇప్పటికే అన్ని అర్హతలున్నా మాఫీ వర్తించని రైతులు మండల వ్యవసాయాధికారి, ఏడీ, డీఏవో కార్యాలయాల్లో.. ఒక్కో రైతు ఇప్పటికే నాలుగైదు సార్లు ఫిర్యాదు చేశారు. అయినా సమస్యను పరిష్కరించకుండానే మళ్లీ ఇంటింటి సర్వే చేయడంపై వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎంత రుణం తీసుకున్నారు..? రెన్యువల్ చేశారా..? లేదా..? రేషన్ కార్డు వివరాలు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతాల్లోని పేర్లను పరిశీలించి వ్యవసాయాధికారులు ప్రత్యేక యాప్‌లో ఎంట్రీ చేస్తున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అన్నదాతలకు త్వరలోనే మీ రుణాలు మాఫీ అవుతాయంటూ సమాధానం చెప్తూ వారిని అక్కడి నుంచి పంపిస్తున్నారు. పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకంలో వేర్వేరుగా ఎంట్రీ అయిన పేర్లను సవరించుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో రైతులు పదిహేను రోజులుగా బ్యాంకులకెళ్లి పేర్లను సరి చేయించుకుంటున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

## ప్రజాపాలన అప్లికేషన్లపై దృష్టి సారించాలి

### వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, సెప్టెంబర్ 20 : వికారాబాద్ జిల్లాలో ప్రజాపాలన సేవా కేంద్రాలకు వచ్చిన దరఖాస్తులపై దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాపాలన యాప్‌లో ఎంత మందికి రేషన్ కార్డులు మ్యాచ్ అయ్యాయి.. మ్యాచ్ కాని వారు ఇంకా ఎంత మంది ఉన్నారని మండలాల వారీగా ఆరా తీశారు. ప్రజాపాలన సేవా కేంద్రాలకు వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుని పరిష్కరించాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు పెయింటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, నర్సరీల్లో నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతి సెంటర్‌కూ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ చల్మారెడ్డి, శిశు, సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లను పెంచాలి

### రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన



కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్

రంగారెడ్డి, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని, ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ ఫ్రంట్ ఆధ్వర్యంలో శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు కులగణన చేపట్టలేదని..ఎన్నికల హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంలేదని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ బీసీలకు అనుకూలంగా మాట్లాడుతుంటే.. రేవంత్ ప్రభుత్వం మాత్రం బీసీ రిజర్వేషన్ల పెంపుపై మాట్లాడకుండా..బీసీలను అణచివేయాలని యత్నిస్తున్నదని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లాలో 214 జూనియర్ కాలేజీలు, 81 డిగ్రీ కాలేజీలు, 255 వృత్తి విద్యా కాలేజీలున్నాయని వాటిలో చదువుతున్న విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇంజినీరింగ్ పూర్తైన విద్యార్థులకు కాలేజీల నిర్వాహకులు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. జిల్లాలో 2022-23లో ఫీజు బకాయిలు రూ.73.80 కోట్లు, 2023-24లో రూ.148 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు.

### అరుదైన వ్యాధిగ్రస్తులకు

## ఆశాదీపం

### నిమ్స్‌లో డే కేర్ సెంటర్ ప్రారంభం



డే కేర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20 : అరుదైన వ్యాధిగ్రస్తులకు నిమ్స్ ఆశాదీపంగా నిలుస్తున్నది. జన్యుల్లో మార్పులు జరిగి అరుదైన వ్యాధులతో పిల్లలు జన్మిస్తారు. అలాంటి వారికి పూర్తి స్థాయిలో చికిత్సలు ఉండవు. ఈ నేపథ్యంలో వారిని అనుక్షణం పర్యవేక్షిస్తూ చికిత్సలు అందించాల్సి ఉంటుంది. నిమ్స్ దవాఖానలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడికల్ జెనెటిక్స్ విభాగా ల్లో అరుదైన వ్యాధులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ డీఎన్ఏ, ఫింగర్ ప్రింటింగ్, డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఈ కేంద్రం పనిచేస్తుంది. ఈ ప్రత్యేక కేంద్రాన్ని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లీజారాజశేఖర్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్, డాక్టర్ చరణ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు.

### మూడు బెడ్లు.. నిష్ణాతులైన వైద్యులు

నిమ్స్‌లో మెడికల్ జెనెటిక్స్ విభాగం ఎదురుగా ఉన్న వార్డులో మూడు బెడ్లను ఏర్పాటు చేశారు. మెడికల్ జెనెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ షగున్ అగర్వాల్, అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞా రంగనాథ్ పర్యవేక్షణలో రోగులకు చికిత్స అందిస్తారు. రోగి పూర్తిగా ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. అరుదైన వ్యాధిగ్రస్తుల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చికిత్స సమయాన్ని కేటాయించా రు. మొత్తం 85 మంది రోగులు చికిత్స తీసుకుంటుండగా, వారిలో పదేండ్ల లోపు వారే ఉన్నారు. వారికి కేటాయించిన తేదీల్లో వచ్చి చికిత్స తీసుకొని వెళ్తుంటారు. వ్యాధిగ్రస్తుల నుంచి సేకరించిన రక్త, ఇతర నమూనాలను సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌కు పంపిస్తారు. వ్యాధికి అనుగుణంగా వాడాల్సిన మందులను సైతం నిర్ణయిస్తారు.

### రోగులకు రూ.50 లక్షల వరకు ఆర్థిక సాయం

భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ 2021లో రేర్ డీసీజ్ చికిత్స కోసం నేషనల్ పాలసీని తీసుకొచ్చింది. నిర్ణీత సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మెడికల్ జెనెటిక్స్ విభాగాల్లో రోగులకు ఉచిత వైద్యం అందించే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించారు. అరుదైన వ్యాధిగా నిర్ధారణ జరిగిన తర్వాత రోగులకు ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.20లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఒక్కో రోగి చికిత్సకు కేటాయిస్తారు. ఇప్పటివరకు 55 అరుదైన వ్యాధులకు గుర్తింపు లభించింది.

## షీ టీమ్స్‌కు చిక్కిన పోకిరీలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): గణనాథుడి దర్శనం కోసం క్యూలో నిల్చున్న మహిళా భక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పోకిరీలు షీటీమ్స్‌కు చిక్కారు. 11 రోజుల్లో 996 మంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారని మహిళా భద్రత డీసీపీ కవిత వెల్లడించారు. ఖైరతాబాద్ బడా గణేశ్‌తోపాటు రద్దీగా ఉన్న ఇతర చోట్ల కూడా షీ టీమ్స్ నిఘా పెట్టిందని, పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేసి వీడియో, ఫొటోగ్రఫీ సాక్ష్యాలతో కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. మరికొందరి వీడియో సాక్ష్యాలు సరిగా లేకపోవడంతో అలాంటి వారిని పట్టుకొని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించిన ట్లు వివరించారు.

## స్టెరాయిడ్స్ సీజ్

సిటీబ్యూరో : దేహదారుఢ్యం కోసం వినియోగించే స్టెరాయిండ్స్‌ను అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఓ షాపుపై డీసీఏ అధికారులు దాడులు చేసి రూ.2 లక్షల విలువ చేసే 22 రకాల స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...నగరానికి చెందిన రాకేశ్ కొండియా కోఠి ఇసామియాబజార్‌లో 'రాకేశ్ డిస్ట్రిబ్యూటర్స్'పేరుతో దేహదారుఢ్యానికి సంబంధించిన పలు రకాల ఉత్పత్తులను విక్రయిస్తున్నాడు. డీసీఏ అనుమతుల్లేకుండా 22 రకాల స్టెరాయిడ్స్ ఔషధాలను జిమ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నాడు. డీసీఏ అధికారులు శుక్రవారం ఆ షాపుపై దాడులు జరిపి, స్టెరాయిడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన డాక్టర్ శ్రీకాంత్‌యాదవ్ మియాపూర్‌లోని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్‌లో 'శ్రీకాంత్ న్యూరో సెంటర్' పేరుతో హాస్పిటల్‌ను నిర్వహిస్తున్నాడు. ఆ దవాఖానలో డీసీఏ అనుమతి లేకుండానే మెడికల్ షాపునూ నిర్వహిస్తున్నాడు. డీసీఏ అధికారులు హాస్పిటల్‌పై దాడులు చేసి రూ.1.01లక్షల విలువ చేసే ఔషధాలను సీజ్ చేశారు.

### విలీన గ్రామాలపై

# హైడ్రా పిడుగు

### 51 పంచాయతీలపై పెత్తనం చెలాయించనున్న హైడ్రా

### ఇటీవలే ఓఆర్ఆర్ లోపలి పంచాయతీలపై ఆర్డినెన్స్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ లోపలి విలీన గ్రామాలపై హైడ్రా పిడుగుపడనున్నది. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి 51 గ్రామ పంచాయతీలు ఇటీవల సమీపంలోని విలీనమమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వం ఈ నెల 3న ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో హైడ్రాకు మంత్రి మండలి అపరిమిత అధికారాలు కట్టబెట్టింది. ఓఆర్ఆర్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, విలీన గ్రామాల్లోని ప్రస్తుత అన్ని విభాగాలకు ఉన్న అధికారాలను హైడ్రాకు కట్టబెట్టింది. దీంతో ఇటీవలే రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 51 గ్రామ పంచాయతీలపై హైడ్రా ఉక్కుపాదం మోపే అవకాశం ఉన్నదన్న ఆందోళనలు మొదలయ్యాయి. చెరువుల రక్షణ పేరుతో ఇప్పటివరకు హైడ్రా జరిపిన కూల్చివేతలన్నీ దాదాపుగా మున్సిపాలిటీల పరిధిలోనే జరిగాయి. ఇకపై విలీన గ్రామ పంచాయతీల్లోనూ బుల్డోజర్లు కనిపిస్తాయన్న చర్చ మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వం తీసుకున్న 'విలీన' నిర్ణయంతో ఆయా గ్రామాల ప్రజలు గుర్రుగా ఉన్నారు. ఇప్పుడు హైడ్రాకు అప్పగించడంతో ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కుంటలు, చెరువుల చుట్టూ ఇండ్లు నిర్మించుకున్న వారు వణికిపోతున్నారు. హైడ్రా ఎప్పుడు వస్తుందో, తమ ఇల్లు ఎప్పుడు కూల్చుతుందో అని ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లూ ఏదైనా సమస్య ఉంటే స్థానికంగా ఉండే సర్పంచ్‌కు, పాలక వర్గానికి చెప్పుకొనేవారిమని, ఇప్పుడు మున్సిపాలిటీల్లో విలీనంతో తమకు ప్రజాప్రతినిధులు దూరమయ్యామని వాపోతున్నారు. దీంతో స్థానిక సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడు హైడ్రా వస్తే తమ సమస్యలను ఎవరు పట్టించుకుంటారని వారు వాపోతున్నారు.

### ఇటీవల విలీనమైన గ్రామాల జాబితా ఇలా..



**రంగారెడ్డి జిల్లా**

| మున్సిపాలిటీ | విలీనమైన గ్రామాలు |
|---|---|
| పెద్ద అంబర్‌పేట | బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారమతిపేట |
| శంషాబాద్ | బహదూర్‌గూడ, పెద్ద గొల్కొండ , చిన్న గొల్కొండ, హమీద్‌ల్లానగర్, రషీద్‌గూడ, ఘన్సిమి గూడ. |
| నార్సింగి | మిర్జాగూడ . |
| తుక్కుగూడ | హర్షగూడ. |

**మేడ్చల్ జిల్లా**

| మున్సిపాలిటి | విలీనమైన గ్రామాలు |
|---|---|
| మేడ్చల్ | పూడూరు, రాయిలాపూర్. |
| దమ్మాయిగూడ | కీసర, యాద్గిర్‌పల్లి, అంకిరెడ్డి పల్లి, చీర్యాయల్, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి. |
| నాగారం | బొగారం, గూడంకుంట, కరీంగూడ, రాంపల్లిదాయర |
| పోచారం | వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరి గూడ. |
| ఘట్‌కేసర్ | అంకుషాపూర్, అవుషాపూర్, మాదారం, ఎదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ. |
| గుండ్లపోచంపల్లి | మునీరాబాద్, గౌడవెల్లి . |
| తూంకుంట | బొమరాసిపేట, శామీర్‌పేట, బాబాగూడ . |

**సంగారెడ్డి జిల్లా**


| మున్సిపాలిటీ | విలీనమైన గ్రామాలు |
|---|---|
| తెల్లాపూర్ | కర్ధనూర్, ముత్తంగి, పోచారం, పాటి, ఘనాపూర్. |
| అమీన్‌పూర్ | ఐలాపూర్, ఐలాపూర్ తండా, సుల్తాన్‌పూర్, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడదాయర |

- జీహెచ్ఎంసీ ఖజానాకు గండికొట్టే యత్నం
- మాన్‌సూన్ పనులను వినాయక ఉత్సవంలో జరిపినట్లు చూపించే ప్లాన్
- చేయని పనులకు బిల్లులు పెట్టి అందినంత దండుకునేలా ఎత్తుగడ
- కాంట్రాక్టర్లతో అధికారుల మిలాఖత్
- బెడిసికొట్టిన వ్యూహం
- మల్కాజిగిరి సర్కిల్‌లో వెలుగులోకి అక్రమాలు
- కమిటీ వేసి.. సమగ్ర విచారణకు డిమాండ్

# టెండర్.. వండర్!

ఒక చేతితో చప్పట్లు రావు...పనుల్లో ఒక్క కాంట్రాక్టర్ లాలూచీ పడితేనే అవినీతి జరగదు..అధికారి కూడా కలిస్తేనే అది పరిపూర్ణమవుతుంది.. ఖజానాకు గండిపడుతుంది.. జీహెచ్ఎంసీలో ఇంజినీరింగ్ విభాగం తీరు ఇలాగే ఉంది. కాంట్రాక్టర్లతో మిలాఖత్ అయిన అధికారులు..మాన్‌సూన్ పనులను వినాయక ఉత్సవాల కింద చేపట్టినట్లు బిల్లులు చూపించి..అందినంత దండుకునేందుకు పావులు కదిపారు. అనుకున్న విధంగా జరిగి ఉంటే.. ఖజానాకు భారీ 'టెండర్' పడేది. అయితే మల్కాజిగిరి సర్కిల్‌లో అక్రమాలు వెలుగులోకి రావడంతో అవినీతిపరులు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. అయితే చాలా సర్కిళ్లలో ఇలాంటి అవినీతి జరిగిందని కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక కమిటీ వేసి..సమగ్ర విచారణ చేపట్టి..చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ )

**గణేశ్ శోభాయాత్ర** ఈ నెల 17న ఆనందోత్సాహాల నడుమ ప్రశాంతంగా ముగిసింది. వాస్తవంగా శోభాయాత్ర జరిగే మార్గాల్లో ముందస్తుగా రహదారులపై గుంతలు లేకుండా చూడటం, ఉన్న ప్యాచ్‌వర్క్‌ను పూర్తి చేయడం వంటి పనుల బాధ్యత ఇంజినీరింగ్ విభాగానిదే. ఇందుకోసం ఒక్కో సర్కిల్‌కు దాదాపు రూ. 80 లక్షల మేర బడ్జెట్ ప్రతిపాదనలను కమిషనర్ ఆదేశాల ప్రకారం జోనల్ కమిషనర్లు ఆమోదం తెలిపారు. ఈ సమయంలో శోభాయాత్రను దృష్టిలో ఉంచుకొని రెండు రోజుల ముందుగానే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు చేపట్టాలి. కానీ డివిజన్ నంబర్ 28 విభాగం అధికారులు టెండర్ 12న పిలిచి 17న టెండర్‌ను తెరిచి.. ఏజెన్సీకి పనులు అప్పగించేందుకు ప్లాన్ చేశారు. ఇక్కడే శోభాయాత్ర 17వ తేదీ కంటే రెండు రోజుల ముందుగానే టెండర్ ప్రక్రియను ముగించి పనులు పూర్తి చేయాలి. 12న 24 గంటల వ్యవధితో షార్ట్ టెండర్ పిలిచే అవకాశం ఉంది. కానీ అధికారులు ఆరు రోజుల వ్యవధితో టెండర్ పిలిచి ఏజెన్సీని ఖరారు చేశారు. నాలుగు చోట్ల పనులకు రూ. 76.80 లక్షల వ్యయంతో టెండర్‌ను ముగించారు. షార్ట్ టెండర్‌ను ఒక్క రోజులో ముగించి 14వ తేదీలోగా సంబంధిత వర్క్‌ను ఎగ్జిక్యూషన్‌లోకి తీసుకురావాల్సిన చోట అవినీతికి తెరలేపారు. ఇందుకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ పనులను ఎంచుకున్నారు.




### వచ్చే వారంలో బిల్లు పెట్టి..

వర్షాకాల సీజన్ కావడంతో ఈ బడ్జెట్‌లో కేటాయించిన పనులను వినాయక ఉత్సవాల పనుల కింద బిల్లులను చూపించి.. అందినంత దండుకునేందుకు పావులు కదిపారు. మాన్‌సూన్ సీజన్ పనులు చేస్తున్న కాంట్రాక్టరే ఈ వినాయక ఉత్సవాల పనుల టెండర్ దక్కించుకోవడంతో అవినీతిని అధికారులు సులువుగా మలచుకున్నారు. వచ్చే వారంలో ఈ బిల్లులు పెట్టి ఖజానాకు భారీ స్థాయిలో కన్నం వేయాలని భావించగా, వాళ్ల వ్యూహం బెడిసికొట్టింది.

### నిధులు పక్కదారి..

ఒక్క మల్కాజిగిరి సర్కిల్‌లోనే కాదు జీహెచ్ఎంసీ పరిధిలోని ఇతర సర్కిళ్లలోనూ ఇదే రీతిలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు లేకపోలేదు. వినాయక ఉత్సవాల సందర్భంగా చేపట్టిన పనులన్నింటిపై కమిషనర్ విచారణ జరిపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒక్క పాట్‌హోల్స్ (రహదారుల గుంతల పూడ్చివేత) పనుల్లోనే కాదు ప్రతి చెరువులోనూ సుందరీకరణ, బేబీ పాండ్స్, లైట్ సిస్టం, జేసీబీ సామగ్రి పేరుతో నిధులు పక్కదారి పట్టించారని, కమిషనర్ ఆమ్రపాలి జోక్యం చేసుకొని విచారణకు ప్రత్యేక కమిటీ వేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ డిమాండ్ చేశారు.